క్లుప్తంగా

మన్నవలో అక్రమంగా మట్టి తవ్వకాలు

పొన్నూరు: మండలంలోని మన్నవ గ్రామం నుంచి సమీప వెంచర్లకు అక్రమంగా మట్టి తరలిపోతోంది. అధికార పార్టీ అండదండలతో స్థానిక టీడీపీ నాయకులు ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా కాలువల్లోని మట్టిని తవ్వి ట్రాక్టర్లలలో తరలిస్తున్నారు. దీనిపై రెవిన్యూ, మైనింగ్ అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామ సర్పంచ్ బొనిగల నాగ మల్లేశ్వరరావు ఒక ప్రకటనలో ఆరోపించారు. స్థానికంగా జరుగుతున్న అక్రమాన్ని రెవెన్యూ, పోలీసు అధికారులకు వివరించినా వారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. నియోజకవర్గ ముఖ్య నేత ప్రధాన అనుచరులు ఈ అక్రమ నిర్వాకానికి పాల్పడే వ్యక్తులు కావడంతో ఏం చర్యలు తీసుకోలేక అధికారులు చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు.

రైతు బజారులో వెలగని ఎల్ఈడీ డిస్‌ప్లే



పొన్నూరు: లక్షల రూపాయలు వెచ్చించి పరికరాలు కొనడం.. కొన్నేళ్ల తర్వాత వాటిని మూలన పడేయడం మార్కెటింగ్ శాఖ అధికారులకు పరిపాటిగా మారుతోంది. నిడుబ్రోలు రైతు బజారుకు వచ్చే వినియోగదారులు కూరగాయల ధరలు సులభంగా తెలుసుకోవాలనే ఉద్దేశంతో ఎలక్ట్రానిక్ డిస్‌ప్లే బోర్డును ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. రోజూ కూరగాయల ధరలు అందులో ప్రదర్శించాలి. ప్రస్తుతం ఆ బోర్డు పాడైంది. కొన్నేళ్లుగా దీనిని పట్టించుకునే నాథుడే కరువయ్యారు. అధికారులు స్పందించి డిస్‌ప్లేని బాగు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని వినియోగదారులు కోరుతున్నారు.

విజ్ఞాన్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు పీహెచ్‌డీ

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రతాప్ కుమార్ రావులకు సీఎస్ఈ విభాగంలో తమ యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టా అందించిందని వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ శుక్రవారం తెలిపారు. 'డిటెక్షన్ అండ్ ప్రివెన్షన్ ఆఫ్ వార్మ్‌హోల్ అటాక్స్ ఇన్ ఏ వెహికులర్ అడహక్ నెట్‌వర్క్' అనే అంశంపై ఆయన పరిశోధన చేశారని తెలియజేశారు. ఈయన తన పరిశోధనలో భాగంగా 4 స్కోపస్ పేపర్లు పబ్లిష్ చేశారని వెల్లడించారు. పీహెచ్‌డీ పట్టా పొందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రతాప్ కుమార్ రావులను పలువురు అభినందించారు.

గ్రామ పార్టీ అధ్యక్షుడికి భరోసా



శేకూరు(చేబ్రోలు): చేబ్రోలు మండలం శేకూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడుని పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ శుక్రవారం పరామర్శించారు. గ్రామ పార్టీ అధ్యక్షుడు కారంకి రాంబాబును టీడీపీ శ్రేణులు వేదింపులు, ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఈ విషయాన్ని అంబటి మురళీకృష్ణ దృష్టికి తీసుకురావటంతో ఆయన శేకూరులోని రాంబాబు ఇంటికి వెళ్లి ఆయనకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎం.శ్యాం, బి.శివయ్య, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో నిందితుడు

పెదకాకాని: కత్తితో దాడి చేసిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. పెదకాకాని సుందరయ్య కాలనీకి చెందిన సీహెచ్ వెంకటేశ్వరరావు సమీపంలోని శంకర కంటి ఆసుపత్రిలో వంట పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. గురువారం అతని కుమారుడు వరుణ్ గేదెలను పొలంకు తీసుకు వెళ్లారు. అదే రోడ్డులో వెళుతున్న కిరణ్, సందీప్‌లపైకి గేదెలు పొడిచేందుకు వెళ్లడంతో వారు వరుణ్‌ను నిలదీశారు. ఈ సందర్భంగా వాగ్వాదం చోటు చేసుకుంది. ఇరువురూ ఒకే కాలనీ వారు కావడంతో సాయంత్రం మళ్లీ వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో బాలుడి తండ్రి వెంకటేశ్వరరావు కత్తితో వచ్చి కిరణ్, సందీప్‌లను, అడ్డు వచ్చిన మరో మహిళ లక్ష్మిను గాయపరిచాడు. బాధితులను చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

ఈసెట్‌లో విద్యార్థుల ప్రతిభ

గుంటూరు ఎడ్యుకేషన్: ఈసెట్ పరీక్షా ఫలితాల్లో జీవీఆర్ కోచింగ్ సెంటర్ విద్యార్థులు ప్రతిభ చూపారని సంస్థ డైరెక్టర్ తురకా వీరయ్య తెలిపారు. సీఎస్ఈలో ఏ. దుర్గాప్రసాద్ 145 మార్కులతో రాష్ట్రస్థాయిలో 89వ ర్యాంకు, ఎం.విశాంత్ కుమార్ 130, సీహెచ్ నవీన్ 145, ఆర్యన్ రాజేష్ 264, షేక్ నేహా 696, కె. సాయిస్వప్న 798, బి. కావ్య 849, డి. వాణి 1053వ ర్యాంకు సాధించినట్లు వివరించారు. ఎలక్ట్రికల్ విభాగంలో ఎల్. కౌషిక్‌కుమార్ 140వ ర్యాంకు, సివిల్ విభాగంలో ఆర్. మణికంఠ 303, వి. శివ సందీప్‌రెడ్డి 481, జి. కీర్తి 853, ఈసీఈ విభాగంలో పి. తేజ 401, యశస్విని 406, రాజరాజేశ్వరి 595, జీవీఎల్ శ్రావణి 532, వై. కావ్య భవాని 1053వ ర్యాంకు పొందారని ఆయన పేర్కొన్నారు.

గాలివాన బీభత్సం

- అకాల వర్షంతో విరిగిపడిన విద్యుత్ స్తంభాలు, చెట్లు
- గొడవర్రులో పిడుగుపాటుకు ఇల్లు దగ్ధం



గొడవర్రులో నేలకొరిగిన భారీ వృక్షం

చేబ్రోలు: మండలంలో శుక్రవారం కురిసిన అకాల వర్షం, ఈదురు గాలుల బీభత్సానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వేసవిలో ఒక్కసారిగా వాతవరణంలో మార్పులు సంభవించి తెల్లవారుజామున బలమైన ఈదురు గాలులు, భారీ వర్షం, ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన వర్షం కురవడంతో స్థానికులు తీవ్ర అవస్థలు పడ్డారు. దీంతో పలు చోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపోవటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. తాటిచెట్లు, భారీ వృక్షాలు నేలకూలిపోయాయి. నారాకోడూరు, గుండవరం, చేబ్రోలు తదితర గ్రామాల్లో దొండపందిళ్లు కూలిపోయాయి. మామిడి, సపోట పండ్ల తోటలకు తీవ్ర నష్టం కలిగింది.

గొడవర్రులో పిడుగుపాటుకు పూరిల్లు దగ్ధం..

చేబ్రోలు మండలం గొడవర్రు గ్రామంలో పిడుగుపాటుకు పూరిల్లు దగ్ధమైంది. గ్రామంలోని నడిం బజారులోని మక్కే వీర రాఘవయ్య ఇంటి ప్రాంగణంలోని కొబ్బరి చెట్టుపై పిడుగు పడి మంటలు ఏర్పడ్డాయి. పక్కనే ఉన్న పూరిల్లుపై నిప్పులు పడటంతో ఇల్లు పూర్తిగా కాలి బూడిదైంది. ప్రధాన సెంటర్‌లోని భారీ వృక్షం ఈదురు గాలులకు నేలకూలిపోయింది. వందేళ్ల చరిత్ర కలిగిన అతిపెద్ద రావి చెట్టు వేళ్లతో సహా విరిగిపోయింది. రోడ్డుకు అడ్డంగా చెట్టు పడడంతో యంత్రాల సహాయంతో స్థానికులు తొలగించారు. ఈదురు గాలుల బీభత్సానికి విద్యుత్ స్తంభాలు సైతం నేలకూలాయి.

విరిగిపడిన చెట్లు, విద్యుత్ స్థంభాలు. దీంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

రైతులకూ తీవ్ర నష్టం..

మండల పరిధిలోని కొత్తరెడ్డిపాలెం, శలపాడు, వడ్లమూడి, శేకూరు గ్రామాల్లోని మామిడి, సపోటా తోటలకు ఈదురు గాలులు, వర్షం తీవ్ర నష్టం కలిగించింది. మామిడి పిందె, కాయ ఈదురు గాలులకు రాలిపోవటంతో పూర్తిగా నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుండవరం, గొడవర్రు, వేజండ్ల, నారాకోడూరు, సుద్దపల్లి, శలపాడు గ్రామాల్లో మిర్చి రైతులు కల్లాల్లో ఆరబోసిన మిర్చిని టార్పాలిన్ పట్టాలు వేసి పంట తడవకుండా జాగ్రత్తలు పడ్డారు. అయినప్పటికి కొంత మేర తడిచినట్లు రైతులు చెబుతున్నారు.

చేబ్రోలు, నారాకోడూరు, గుండవరం తదితర గ్రామాల్లోని దొండ, కాకర పందిరి తోటలు ఈదురు గాలులు, వర్షానికి కూలిపోయాయి.

పొన్నూరు: పొన్నూరులో తెల్లవారుజామున ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. సుమారు రెండు గంటల పాటు కురిసిన వర్షానికి పట్టణంలోని రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మురుగు కాలువలు పొంగిపొర్లడంతో నీరు రహదారులపై ప్రవహించింది. ప్రధాన డ్రెయిన్లలోని చెత్తాచెదారం రోడ్లపైకి చేరింది. వర్షం కారణంగా గంటల కొద్దీ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. గాలులు నిలిచిన తరువాత సరఫరా పునరుద్ధరించారు. నిడుబ్రోలు వంతెన వద్ద భారీ వృక్షం నేలకొరగడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. వెంటనే స్పందించిన మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు యుద్ధ ప్రాతిపదికన చెట్టు తొలగింపు చర్యలు చేపట్టారు.



నిడుబ్రోలులో చెట్టు తొలగింపు



ఆర్టీసీ డిపో వద్ద రోడ్డుపై చేరిన నీరు

వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుల నియామకం

ప్రత్తిపాడు: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రత్తిపాడు నియోజకవర్గంలోని మూడు మండలాలకు మండల పార్టీ అధ్యక్షులను, అసెంబ్లీ నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులనూ నియమించారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. ప్రత్తిపాడు మండల పార్టీ అధ్యక్షుడిగా చల్లా హనుమంత్ యాదవ్, వట్టిచెరుకూరు మండల పార్టీ అధ్యక్షుడిగా మన్నవ వీరనారాయణ, గుంటూరు రూరల్ మండల పార్టీ అధ్యక్షుడిగా ఆళ్ల శ్రీనివాసరెడ్డిని నియమించారు. 24 అనుబంధ విభాగాలకు అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షులను సైతం నియమించారు. యూత్ వింగ్ నియోజకవర్గ అధ్యక్షుడిగా కొండా కోటిరెడ్డి, మహిళా విభాగానికి బాపతు వెంకటరమణ, రైతు విభాగానికి కొండా కృష్ణారెడ్డి, బీసీసెల్‌కు దారం అశోక్ యాదవ్, ఎస్సీ సెల్‌కు గేరా పున్నారావు, మైనారిటీ సెల్‌కు సయ్యద్ నూరుల్లా, స్టూడెంట్ వింగ్‌కు ఆమదాల కెన్నడీ, పంచాయతీరాజ్ వింగ్‌కు దొడ్డా రామ్‌జీ అంబేడ్కర్, మున్సిపల్ వింగ్‌కు డొక్కు కాటమరాజు నియమితులయ్యారు. ఆర్టీఐ వింగ్‌కు తంగెళ్ల నాగేశ్వరరావు, వాలంటీర్స్ వింగ్‌కు వల్లూరి సుధాకర్, గ్రీవెన్స్ సెల్‌కు గుజ్జుల శివారెడ్డి, వాణిజ్య విభాగానికి ఎగుసుపల్లి నాగిరెడ్డి, వైఎస్సార్‌టీయూసీకి అమర్తల తిరుపతి బాబు, అంగన్‌వాడీ వింగ్‌కు రుద్రపాటి సులోచన, లీగల్ సెల్‌కు గేరా సుబ్బారావు, కల్చరల్ వింగ్‌కు దూళిపాళ్ల శ్రీహరి, సోషల్ మీడియా వింగ్‌కు వాసిమళ్ల సన్ని, ఐటీ వింగ్‌కు భీమినేని సాయి కృష్ణ, దివ్యాంగుల విభాగానికి షేక్ నాగుర్ మీరావలి, డాక్టర్స్ వింగ్‌కు చిలకా కోటి, పబ్లిసిటీ వింగ్‌కు కొండా అజయ్ రెడ్డి, బూత్ కమిటీస్ వింగ్‌కు ఉడుతూరి ఓం ప్రకాష్ రెడ్డి, ఇంటెలెక్చువల్స్ ఫోరమ్‌కు పెరవలి రమేష్‌లను నియమించారు.

గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న యుగకీర్తి

కాకుమాను: మండలంలోని గ్రామాల్లో వేసవి దృష్ట్యా తాగునీటి సమస్యలు లేకుండా సిబ్బంది తగిన చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ యుగకీర్తి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలోని పలు గ్రామాలలో తాగునీటి సమస్య ఉన్న విషయం తమ దృష్టికి వచ్చినట్లు పేర్కొన్నారు. వెంటనే ఆయా గ్రామాలలో ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ కార్యదర్శులు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ.. గ్రామాలలో జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధిహామీ పథకం ద్వారా పనులు కల్పించాలన్నారు. 2025-26 సంవత్సరాలలో చేపట్టవలసిన పనులను గుర్తించాలని సిబ్బందికి సూచించారు. జడ్పీటీసీ మూజవర్ షక్ గుల్జార్ బేగం మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలను అందించే విధంగా అధికారులు కృషి చేయాలని ఆమె తెలిపారు. సమావేశంలో మండల కో-ఆప్షన్ సభ్యులు సుభాని, ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

21 నుంచి శ్రీ ప్రపత్తాంజనేయుని బ్రహ్మోత్సవాలు

పొన్నూరు: నండూరులోని శ్రీ పంచముఖి హనుమత్ పీఠం ప్రాంగణంలోని శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో ఈనెల 21వ తేదీ నుంచి 24 వరకు స్వామివారి కల్యాణ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు పీఠం నిర్వాహకులు వల్లూరు శ్రీనివాస శర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 21న ఉదయం విఘ్నేశ్వర పూజతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని అన్నారు. నిత్యం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు, జరుగుతాయన్నారు. 22న హనుమజ్జయంతి పురస్కరించుకుని ఉదయం 7 గంటలకు నిత్య అనుష్టానములు, స్వామికి విశేష ద్రవ్యాలతో అభిషేక అర్చనలు, 8.30కు శతసహస్ర నాగవల్లీ దళార్చన (లక్ష తమలపాకులతో పూజ), హోమాలు, అనంతరం తీర్థప్రసాద వితరణ జరుగుతుందని తెలిపారు. 11 గంటలకు హనుమజ్జన్మ కథ, సాయంత్రం లలితా విష్ణు సహస్రనామ పారాయణ, సహస్ర నామార్చన, హోమం, పంచహారతులు, వేదస్వస్తి ఉంటాయన్నారు. 23న ఉదయం 5 గంటలకు హనుమాన్ చాలీసా పారాయణ, పూజలు, హోమాలు, శ్రీ సువర్చలా హనుమాన్ కల్యాణం, పూర్ణాహుతి నిర్వహిస్తామని పేర్కొన్నారు. 24న విశేష పూజా కార్యక్రమాలు, సాయంత్రం 6 గంటలకు కల్యాణ మూర్తుల గ్రామోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు కార్యక్రమాల్లో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



ఆరాధనా సప్తాహ మహోత్సవంలో బలసాని కిరణ్‌కుమార్

ప్రత్తిపాడు: గుంటూరు రూరల్ మండలం 26వ డివిజన్‌లోని కొత్తూరు (దాసరిపాలెం)లో శ్రీశ్రీ రామానంద స్వామి, ధ్యానాంజనేయ స్వామి వారి 54వ ఆరాధనా సప్తాహ మహోత్సవంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్ శుక్రవారం పాల్గొన్నారు. ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి మేకతోటి దయాసాగర్‌తో కలిసి పాల్గొని స్వామి వారి ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం 26వ డివిజన్ పరిధిలోని దాసరిపాలెంలో కొద్ది రోజుల కిందట అకాల మరణం చెందిన వాసిమళ్ల శ్యాంబాబు నివాసానికి ఆయన వెళ్లారు. శ్యాంబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపి, పరామర్శించారు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న వాసిమళ్ల రవీంద్ర, జరుగుమల్లి పెద్ద రాముడు, మేడిద సుబ్బయ్య, వాసిమళ్ల ముత్తయ్య, సూరగాని సత్యనారాయణలను వారి నివాసాలకు వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని సూచించారు.

చోరీల కేసులో అయిదుగురు నిందితుల అరెస్టు

– రూ.3.20 లక్షల విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం



వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ భానూదయ

ప్రత్తిపాడు: నల్లపాడు పోలీస్ స్టేషనులో గుంటూరు సౌత్ సబ్ డివిజన్ డీఎస్పీ భానూదయ శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆలయాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుల వివరాలను వెల్లడించారు. ఆమె తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి.. ఇద్దరు అన్నదమ్ములు ఒక కేసులో జైలుకు వెళ్లారు. అన్నదమ్ములకు అక్కడ మరో ఖైదీతో పరిచయం ఏర్పడింది. వారు ముగ్గురూ కలిసి మరో జైలుకు వెళ్లారు. అక్కడ మరో ఇద్దరు ఖైదీలతో వీరికి పరిచరం ఏర్పడింది. అయిదుగురి మధ్య స్నేహం కుదిరి బయటకు వచ్చాక వారిలో ఇద్దరు పగలు ఆలయాలపై రెక్కీ నిర్వహించి, రాత్రికి అయిదుగురూ కలిసి దేవాలయాలే టార్గెట్‌గా దొంగతనాలకు పాల్పడుతున్నారు. వీరిని నల్లపాడు పోలీసులు అరెస్టు చేశారు. మూడు పోలీస్ స్టేషన్ల పరిధిలోని దేవాలయాల్లో జరిగిన దొంగతనాలకు సంబంధించి సుమారు రూ.3.20 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఎక్కువగా బంగారు, వెండి ఆభరణాలు ఉన్న దేవాలయాలను టార్గెట్‌గా చేసుకొని చోరీలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. నిందితులను పట్టుకున్న నల్లపాడు పోలీస్ స్టేషన్ సీఐ కె.వంశీధర్, హెడ్ కానిస్టేబుల్ సుబ్బారావు, సి.సి.ఎస్ సీఐ ఎం.వి.సుబ్బారావు ఇతర సిబ్బంది రామకృష్ణ, వి.ప్రసాద్, పీటర్ రాజు, కృష్ణప్రసాద్, బి.వెంకటరావు, వీరయ్యలను ఎస్పీ అభినందించి రివార్డులు ప్రకటించినట్లు డీఎస్పీ భానూదయ తెలిపారు.

మండల వైఎస్సార్‌సీపీ సమావేశం నేడు

చేబ్రోలు: చేబ్రోలు మండల వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకుల సమావేశం శనివారం మండల పరిధిలోని వేజండ్ల గ్రామంలో నిర్వహిస్తున్నట్లు పొన్నూరు నియోజకవర్గ సమన్వయ కర్త అంబటి మురళీకృష్ణ శుక్రవారం తెలిపారు. వేజండ్లలోని చిన్ని కృష్ణారెడ్డి కల్యాణ మండపంలో సాయంత్రం 5 గంటలకు సమావేశం జరుగుతుందని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ బలోపేతానికి సమీక్ష నిర్వహించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకుల అభిప్రాయాలను సేకరించి అధిష్టానానికి పంపనున్నట్లు పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ పార్టీ పదవుల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు అందరూ హాజరు కావాలని ఆయన కోరారు.

అలరించిన 'ఉత్తర గో గ్రహణం' తోలు బొమ్మలాట



నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై శుక్రవారం తోలు బొమ్మలాట ప్రదర్శించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్.మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. గుళ్లపల్లి సుబ్బారావు సేవా సంస్థ సౌజన్యంతో శ్రీ షిర్డీ సాయి తోలు బొమ్మలాట బృందం (నరసరావుపేట) తెలుగు ప్రాచీన కళారూపం ఉత్తర గోగ్రహణం తోలు బొమ్మలాట ప్రదర్శించారు. పాండవుల అజ్ఞాతవాసం, బృహన్నల నాట్య గురుత్వం, కౌరవుల కుట్ర, ఉత్తర కుమారుని ప్రగల్భాలు, ఉత్తర గో గ్రహణం చేసి కౌరవులను అర్జునుడు ఓడించిన ఘట్టాలను పద్యాలు, గేయాలు, వచనంతో ప్రదర్శించారు. ప్రేక్షకులను ఇవి అలరించాయి. అనంతరం కళాకారులను గుళ్లపల్లి రాఘవరావు సత్కరించారు.

ప్రాణాంతక డెంగీ పట్ల అప్రమత్తంగా ఉండాలి



తుమ్మలపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ మేరీ యునిస్

ప్రత్తిపాడు: ప్రాణాంతక డెంగీ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గొట్టిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మేరీ యునిస్ అన్నారు. పెదగొట్టిపాడు పీహెచ్‌సీ పరిధిలోని తుమ్మలపాలెంలో ప్రపంచ డెంగీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మూడు పద్ధతులను పాటిద్దాం.. డెంగీను ఓడిద్దాం.. ఫ్రైడే డ్రైడే.. అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో కె.చెల్లమ్మ, ఏఎన్ఎంలు నాగమణి, శ్రీలత ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. యనమదలలో డాక్టర్ హేమంత్ ఆధ్వర్యంలో డెంగీపై అవగాహన ర్యాలీ, ఫ్రైడే డ్రైడేను నిర్వహించారు. గనికపూడిలో ఏఎన్ఎం అనిత ఆధ్వర్యంలో, గొట్టిపాడులో ఏఎన్ఎం కళావతిల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

చేబ్రోలు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని.. దోమల వ్యాప్తిని అరికట్టడం ద్వారా డెంగీను నివారించవచ్చని చేబ్రోలు పీహెచ్‌సీ వైద్యాధికారి అబ్రహం లింకన్ అన్నారు. మండల కేంద్రమైన చేబ్రోలులో శుక్రవారం జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా ర్యాలీ, అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. శైలజ, సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పొన్నూరు: పరిసరాల పరిశుభ్రతతోనే డెంగీ వ్యాధిని నివారించగలమని పట్టణంలోని ఇందిరా నగర్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్.హరిణి అన్నారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో డెంగ్యూ వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ పొన్నూరు ఇన్‌చార్జి కె.హరిబాబు, యుపీహెచ్‌సీ సిబ్బంది, ఏఎన్‌యంలు, ఆవా కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

మాయల మాంత్రికుడు మోదీ

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న ముప్పాళ్ల

లక్ష్మీపురం: కేంద్రంలో అధికారం చలాయిస్తున్న నరేంద్ర మోదీ మాయల మాంత్రికుడని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు విమర్శించారు. సీపీఐ గుంటూరు జిల్లా కౌన్సిల్ సభ్యుల సమావేశం శుక్రవారం మల్లయ్య లింగం భవన్‌లో శుక్రవారం జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.ఆదేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ నరేంద్ర మోదీ మాయమాటలను నమ్మే పరిస్థితులలో ప్రజలు లేరని అన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం మరోసారి అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక అప్పులు కట్టలేక అనేక మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి సీపీఐ మహాసభలు జరుగుతాయని, అందులో భాగంగా సెప్టెంబర్‌లో ఛండీగఢ్‌లో జాతీయ మహాసభలు జరుగనున్నాయని తెలిపారు. ఆగస్టు 22-24 తేదీల్లో ఒంగోలులో రాష్ట్ర మహాసభలు జరుగబోతున్నాయని వెల్లడించారు. వీటికంటే ముందు మండల, నియోజకవర్గ, జిల్లా మహాసభలు నిర్వహించేందుకు సన్నద్ధం కావాలని పార్టీ శ్రేణులకు ముప్పాళ్ల పిలుపునిచ్చారు.

సైబర్ నేరాలపై ప్రజలకు అప్రమత్తత అవసరం

రూ.60 లక్షల విలువ చేసే 300 మొబైల్ ఫోన్లు బాధితులకు అప్పగింత



మహిళకు మొబైల్‌ఫోన్ అప్పగిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

నగరంపాలెం: సెల్‌ఫోన్ల ద్వారా జరిగే సైబర్ నేరాలపై జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సతీష్ కుమార్ సూచించారు. మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న బాధితులకు శుక్రవారం ఆయన జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని హాలులో వాటిని అప్పగించారు. రూ.60 లక్షల విలువ చేసే 300 ఫోన్లను గుర్తించి, బాధితులకు ఉచితంగా అందజేసినట్లు ఆయన చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తిస్తున్నామని చెప్పారు. ఇప్పటి దాకా రూ.5.80 కోట్లు విలువైన 2,900 మొబైల్ ఫోన్లను బాధితులకు అప్పగించామని తెలిపారు. సెల్‌ఫోన్లు పోయిన వెంటనే జాతీయ సైబర్ క్రైం నంబర్ 1930కు లేదా పోలీస్ సహాయత నంబర్ 8688831574 లేదా సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు ఇవ్వాలని ఆయన సూచించారు. అపరిచిత వ్యక్తుల నుంచి బెదిరింపు ఫోన్ కాల్స్ వస్తే దగ్గరలోని పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. ఫోన్ల రికవరీకి కృషిచేసిన ఐటీ కోర్ సీఐ నిషార్ బాషా, హెచ్‌సీలు కిశోర్, రమేష్, కానిస్టేబుళ్లు శ్రీధర్, మానస, కరీముల్లాను జిల్లా ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో జిల్లా ఏఎస్పీ (ఏఆర్) ఎ.హనుమంతు, ఎస్‌బీ సీఐ అలహరి శ్రీనివాస్, ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ కాలుష్యాన్ని అడ్డుకోవాలి

నెహ్రూనగర్: పర్యావరణ కాలుష్యాన్ని అడ్డుకోవడంతో వేడి వాతావరణాన్ని తగ్గించుకోవచ్చని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. వాతావరణ కాలుష్య నియంత్రణపై ఐటీసీ ఫినిష్ సంస్థ శుక్రవారం రూపొందించిన వాల్‌పోస్టర్‌ని కమిషనర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం సమాజం ఎదుర్కొంటున్న అతి ముఖ్యమైన సమస్యల్లో పర్యావరణ కాలుష్యం ఒకటని తెలిపారు. నియంత్రణకు ప్రభుత్వాలు, సంస్థలతో పాటుగా ప్రజలు కూడా వ్యక్తిగత బాధ్యతగా తీసుకోవాలని ఆయన సూచించారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని నగరంలో చలివేంద్రాలు, ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్స్ వద్ద నీడ వచ్చేలా గ్రీన్ మ్యాట్ ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రభుత్వం ప్రతి 3వ శనివారం స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్రలో భాగంగా ఈసారి బీట్ ది హీట్ నినాదం ఇచ్చిందని పేర్కొన్నారు. దీనికి అనుగుణంగా నగరంలోని వార్డ్ సచివాలయాల వారీగా ప్రజా ప్రతినిధులు, ప్రజలు, వివిధ స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యులు కావాలని ఆయన కోరారు. ప్రజలకు వాతావరణ కాలుష్యం, ప్రమాదాలు, నియంత్రణపై అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నామని ఆయన వెల్లడించారు.

వర్షంలోనూ సీహెచ్‌ఓల నిరసన

లక్ష్మీపురం: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వైద్య ఆరోగ్య శాఖలోని సీహెచ్‌ఓలు శుక్రవారం వర్షాన్ని సైతం లెక్క చేయకుండా సమ్మె చేపట్టారు. జిల్లా కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద సీహెచ్‌ఓల సమ్మె 19వ రోజుకు చేరుకుంది. యూనియన్ గుంటూరు జిల్లా జనరల్ సెక్రటరీ పల్లపాటి లింగరాజు మాట్లాడుతూ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లగా పని చేస్తున్న తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఎన్‌హెచ్‌ఎంలో ఆరు సంవత్సరాల నుంచి సీహెచ్‌ఓలుగా గ్రామీణ ప్రాంతాలలో వైద్య సేవలు అందిస్తున్న తమ సమస్యలు పరిష్కరించకపోవడం శోచనీయమని తెలిపారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ చేయాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షురాలు జి. వనజ మాట్లాడుతూ రెగ్యులరైజేషన్, వేతన సవరణ, ప్రావిడెంట్ ఫండ్ తదితర సమస్యలను త్వరితగతిన చర్చలు జరిపి, స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ సీహెచ్‌ఓలు నిరవధిక సమ్మె చేస్తున్న పట్టించుకోకుండా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉండటం బాధాకరమని ఖండించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అంజిబాబు, జిల్లాకోఆర్డినేటర్ దీక్షిత, జిల్లా నాయకులు జీవనజ్యోతి, శోభారాణి, కె.లక్ష్మి, సుభాని, జహీర్, టి.సిరి, ఐ.జ్యోతి, జిల్లా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ పాల్గొన్నారు.